క్లుప్తంగా

హరీష్‌రావును కలిసిన రిటైర్డు ఉద్యోగులు



హరీష్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

కోదాడఅర్బన్ : తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శనివారం మంత్రి తన్నీరు హరీష్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కోదాడ యూనిట్ సభ్యుడు ఆర్ సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్స్‌లకు అందించే ఉచిత వైద్య, ఆరోగ్య పథకం తమకూ వర్తింపచేయాలని, ఈహెచ్‌ఎస్ ట్రస్ట్‌లో సభ్యత్వం వర్తింపచేయాలని కోరినట్లు తెలిపారు. తమ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.చంద్రశేఖర్, కోశాధికారి గంగారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న దాతలు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన మహ్మద్ అమీనాబీబేగం కుమారుడు జానీపాష తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శనివారం వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలావెంకటరమణారెడ్డి ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లారి సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ టాపర్‌గా ఎస్వీ కళాశాల విద్యార్థి



పుష్పలతను అభినందిస్తున్న అందె సత్యం

కోదాడఅర్బన్ : పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలకు చెందిన గడ్డమీద పుష్పలత మహాత్మాగాంధీ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. దీంతో విద్యార్థినిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ అందె సత్యం, కళాశాల కరస్పాండెంట్ ముత్తినేని సైదయ్యలు అభినందించారు. కాగా కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు 10 జీపీఏకు 9 జీపీఏ కంటే అధిక మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్కేరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓరుగంటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో సీట్లు సాధించడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న నల్లగొండ జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కోదాడఅర్బన్ : సైనిక్ స్కూల్ అడ్మిషన్ల కోసం నిర్వహించిన పరీక్షలో కోదాడకు చెందిన శ్రీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి సీట్లు సాధించడం అభినందనీయమని నల్లగొండ జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. సైనిక్ స్కూల్‌లో సీట్లు సాధించిన విద్యార్థులను శనివారం ఆయన పాఠశాలలో అభినందించారు. కాగా పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్ సీట్ల కోసం పరీక్ష రాయగా 11 మంది విద్యార్థులు సీహెచ్ సాధన చరిత, సీహెచ్ నీలిమా, సీహెచ్ హేమ తేజ్‌వర్మ, బి. నవ్యశ్రీ, పి.ధనుంజయ్, కె.నివేదిత వర్మ, ఎస్.అన్విద్‌కుమార్, ఎ.సాయి సోహన్‌రెడ్డి, కె.ధనుష్, ఎస్.రిషి, ఎస్.నిశాంత్ రెడ్డిలు సైనిక్ స్కూల్ సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, నర్సింహారావు, విజయ్‌సాగర్, జి.గంగ, విద్యార్థులు పాల్గొన్నారు.

27న మండల పరిషత్ అత్యవసర సమావేశం

నేరేడుచర్ల : మండల పరిషత్ అత్యవసర సమావేశాన్ని ఈనెల 27వ తేదిన ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కుక్కలు, కోతుల బెడదను నివారించాలి

- పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి
- రోడ్డు పనులు పూర్తి చేయాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో కమిషనర్‌కు సమస్యలు విన్నవించిన నేరేడుచర్ల మున్సిపాలిటీ వాసులు
- సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని కమిషనర్ హామీ

సాక్షి ఫోన్‌ఇన్

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానంగా కుక్కలు, కోతులు, పందులు, పారిశుద్ధ్యంపై కమిషనర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు.

→ 12వ వార్డులోని ఖాళీ స్థలాల్లో చెట్లు విపరీతంగా పెరిగి పందులు, కోతులకు నిలయంగా మారాయి. వారం రోజుల క్రితం రెండు పందులు చనిపోయి దుర్వాసన వస్తోంది.
– బొంత మోహన్‌రెడ్డి, అబ్దుల్ లతీఫ్

కమిషనర్ : మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చనిపోయిన పందుల కళేబరాలను తొలగిస్తాం. ఖాళీ స్థలం యాజమానితో మాట్లాడి చెట్లను తొలగించాలని నోటీసులు జారీ చేస్తాం.

→ 2వ వార్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో, విద్యానగర్‌లో డ్రెయినేజీ నీరు రోడ్లపైకి వస్తుంది. అదేవిధంగా పాదచారులు, ద్విచక్రవాహనదారులపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి.
– గజ్జల కోటేశ్వర్‌రావు



ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

కమిషనర్ : పూడిపోయిన ప్రధాన డ్రెయినేజీలను జేసీబీతో తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతాం. కుక్కల బెడదను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం.

→ 10వ వార్డులో రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. కానీ పనులు పూర్తి చేయకపోవడంతో విపరీతమైన దుమ్ము వస్తుంది.
– అరవింద్‌కుమార్, 10వ వార్డు

కమిషనర్ : రోడ్డు వెంట విద్యుత్ స్తంభాలను పాతిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయిస్తాం. అప్పటి వరకు ఉదయం, సాయంత్రం దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీటిని చల్లిస్తాం.

→ నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డులో దుకాణాల యాజమానులు రోడ్లపై చెత్తాచెదారం వేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం.
– సైదులు, జాన్‌పహాడ్ రోడ్డు

కమిషనర్ : రోడ్లపై చెత్తాచెదారం వేయకుండా దుకాణా యాజమానులకు నోటీసులు జారీ చేస్తాం. మున్సిపాలిటీ చెత్త బండ్లు వచ్చినప్పుడు వాటిలో చెత్తవేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

→ 4 వార్డులో గల అరవింద డిగ్రీ కళాశాల వెనుక భాగంలో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. కుక్కలు, పందులతో ఇబ్బందులు పడుతున్నాం.
– బుద్దె ప్రసాద్, ఉదయ్‌కుమార్, తాటికొండ శ్రీనివాస్‌రెడ్డి

కమిషనర్ : మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం. వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

→ మున్సిపాలిటీ పరిధిలోని జడ్జర్ల – కోదాడ జాతీయ రహదారిపై చిరు వ్యాపారులు తమ తోపుడు బండ్లను రోడ్లపై పెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.
– మెట్టు మధుసూదన్‌రెడ్డి

కమిషనర్ : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారులకు, దుకాణాదారులకు నోటీసులు జారీ చేస్తాం.

→ 11 వార్డులోని గ్రంథాలయం వీధిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్తుంటే దాడులు చేసి గాయపరుస్తున్నాయి. – ఎస్‌కే బాషా

కమిషనర్ : కుక్కల నివారణకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా చర్యలు చేపట్టి ఇబ్బందులు తొలగిస్తాం.

→ 15వ వార్డులోని అంజలి స్కూల్ రోడ్డులో మిషన్ భగీరథ నీటితో పాటు మున్సిపాలిటీ ట్యాంకు నీరు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం.
– సుంకరి క్రాంతికుమార్

కమిషనర్ : మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి నీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

→ మున్సిపాలిటీలోని 7వ వార్డులోని రాంపురంలో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీపై కల్వర్టు సరిగా నిర్మించకపోకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. – రవీందర్‌రెడ్డి

కమిషనర్ : డ్రెయినేజీ కాలువ పూర్తి చేయించి మురుగునీరు నిల్వ ఉండకుండా సమస్యను పరిష్కరిస్తాం.

→ 3వ వార్డులో గన్నీ బ్యాగుల మరమ్మతుల కేంద్రం నుంచి దుమ్ము వస్తుండటంతో అనారోగ్యానికి గురవుతున్నాం. – పోలిశెట్టి సైదులు

కమిషనర్ : గన్నీ బ్యాగుల మరమ్మతులు కేంద్రం యాజమాన్యంతో మాట్లాడి దుమ్మురాకుండా రక్షణ చర్యలు ఏర్పాటు చేసుకునేలా చూస్తాం.

6వ వార్డు రాంపురం రోడ్డులో విద్యుత్ స్తంభాలకు సిటీ కేబుల్ వైర్లు అడ్డగోలుగా వేలాడదీయడంతో ప్రమాదకరంగా మారాయి. ఇళ్ల మధ్య మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది.
– కర్రి సతీష్‌రెడ్డి, కాసాని నాగరాజు, అంజి, సృజన్, రాచకొండ విజయలక్ష్మి, 6వ వార్డు

కమిషనర్ : సిటీకేబుల్ యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. డ్రెయినేజీలను పూర్తి చేసి మురుగునీరు నిల్వ లేకుండా చూస్తాం. డ్రెయినేజీ నిర్మాణాలు లేని చోట మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం.

నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో కుక్కలు, కోతులు, పందులు విపరీతంగా తిరుగుతున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్లు వేశారు. కానీ నేటి వరకు నీటిని విడుదల చేయలేదు. క్రీడా ప్రాంగణంలో డ్రెయినేజీ నీరు చేరుతోంది. చెత్త తరలించే ఆటోలకు మైకులు బిగించాలి.
– రణబోతు శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి మాధవరెడ్డి, పాతూరి శ్రీనివాస్‌రావు, ఓరుగంటి సత్యనారాయణ, జిలకర రామస్వామి, 14వ వార్డు

కమిషనర్ : కుక్కలు, కోతులను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వాటిని పట్టుకొని అడవుల్లో వదిలేస్తాం. క్రీడా ప్రాంగణంలోనికి మురుగునీరు రాకుండా ప్రత్యేక చర్యలు చేపడతాం. పందుల యాజమానులకు నోటీసులు జారీ చేస్తాం. డ్రెయినేజీ, పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరుస్తాం. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేసేలా చూస్తాం. గతంలో ఉన్న మైకులను మరమ్మతులకు పంపించాం. అవి రాగానే చెత్తసేకరణ ఆటోలకు బిగిస్తాం.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- 7569 మంది నిరుద్యోగులు హాజరు
- 3018 మందికి ఆఫర్ లెటర్స్

కోదాడ : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 3 వేల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందడం అభినందనీయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. శనివారం కోదాడలోని పెరికభవన్‌లో నిర్వహించిన మెగాజాబ్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోదాడలో మును పెన్నడూ లేని విధంగా మెగా జాబ్ మేళా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కోదాడ ప్రాంతంతో పాటు జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చిందని నిర్వాహకుడు శశిధర్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రదేశాల నుంచి దాదాపు 7569 మంది ఈ మేళాలో పాల్గొనగా వారిలో 3018 మందికి 72 కంపెనీలు ఉద్యోగ ఆఫర్ లెటర్స్ అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన వారికి ఆఫర్ లెటర్లు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏర్నేని బాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, ఎంపీపీలు ప్రశాంతి, ఆశాశ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీలు కొణతం ఉమ శ్రీనివాసరెడ్డి, బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, వివిధ పార్టీల నాయకులు దొడ్డా నారాయణరావు, పిల్లుట్ల శ్రీనివాస్, డాక్టర్ అందె సత్యం, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, చింతబాబు, వట్టికూటి నాగయ్య పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న శశిధర్‌రెడ్డి, చందర్‌రావు, తదితరులు

హక్కుల సాధనకు మాలలు ఉద్యమించాలి

హుజూర్‌నగర్ : హక్కుల సాధనకు మాలలు ఉద్యమించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో నిర్వహించిన మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు ముఖ్యంగా మాలలకు ప్రతీ విషయంలో అన్యాయం జరుగుతోందని, మాలలు మేలుకుని హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. అనంతరం మాల మహానాడు యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా నూకతొట్టి ప్రమోద్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని అతనికి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.వీరబాబు, రాష్ట్ర మహిళ అధ్యక్ష, కార్యదర్శులు జి.పున్నమ్మ, పి.రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.జోసఫ్, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.శోభ, టౌన్ అధ్యక్షుడు బాబూరావు, నిఖిల్, విక్రం, వివేక్, వెంకి, నరసరావు తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రవి

ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు సరికాదు

హుజూర్‌నగర్ : ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలనడం అవివేకమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కాకి అజయ్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెడుతున్నది తెలంగాణనే అని మంత్రులు, అధికారులే ప్రకటనలు చేస్తూ మరోపక్క స్టార్టర్లు తొలగిస్తామనడం సరైనది కాదన్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించడానికి అధికారులు వస్తే రైతులు అడ్డుకోవాలని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇస్తామన్న సీఎం హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆటోమెటిక్ స్టార్టర్ల తొలగింపు ప్రకటనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, గురవయ్య, వీరయ్య, పెద్ద నాగేశ్వరరావు, ప్రభు, సైదులు, నాగయ్య, రాజు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

మునగాల : మండలంలోని నేలమర్రిలో గల రైతు వేదికలో శనివారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మకమైన సాగునీటి వసతి, ఎర్రగరప, ఇసుక నేలలు, నీటి నిలువ లేని నల్లరేగడి నేలల్లో కూడా బిందు సేద్యంలో ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చునన్నారు. బిందుసేద్యం పరికరాలను ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 100 శాతం సబ్సిడీ, ఇతరులకు 90 శాతం సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందన్నారు. నాలుగు సంవత్సరాల పాటు యాజమాన్య చర్యల కోసం ఎకరానికి రూ.2100, అంతర్ పంటల కోసం రూ.2100 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.16,800లు వరకు రాయితీ ఇస్తుందన్నారు. ఆసక్తి కల్గిన రైతులు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి భవాని, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ఫీల్డ్ అసిస్టెంటు అమరనాథ్, ఫీల్డ్ అధికారి సుధాకర్, గ్రామ సర్పంచ్ జలగం సోములు, రైతులు పాశం ఇంద్రారెడ్డి, రెణబోతు పాపిరెడ్డి, గుడుపూడి శంకర్ చిట్యాల బక్కయ్య పాల్గొన్నారు.

కేంద్ర పథకాల గురించి తెలుసుకోవాలి

పాలకవీడు : దేశ ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మూసీఒడ్డుసింగారం గ్రామంలో నిర్వహించిన ప్రజా గోస –బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం సామాన్యుల కోసం ప్రవేశపెట్టిన ఈ– శ్రమ్, ఆయుష్మాన్ భారత్, రైతులకు ఫసల్ బీమా, కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలను ప్రజలకు వివరించారు. ఎరువుల సబ్సిడీ, ఉజ్వల గ్యాస్, జీవన్ జ్యోతి గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం వంటి ప్రయోజనాలను గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ నాగరాజు, నేరేడుచర్ల అధ్యక్షుడు విజయ్‌కుమార్, వెంకన్న, సతీష్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గోస– బీజేపీ భరోసా సమావేశం

చిలుకూరు : చిలుకూరు గ్రామంలో శనివారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా గోస– బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు గ్రామాల్లో సామాన్య ప్రజలకు అందుతున్నాయన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని, దీంతో రైతులు నష్ట పరిహారం పొందలేకపోతున్నారని తెలిపారు. అనంతరం గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురంచి వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వంగవీటి శ్రీనివాస్‌రావు, కనగాల నారాయణ, కొడారు సుదర్శన్, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలి

చిలుకూరు : గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 12వ చేపట్టిన పాదయాత్ర ఈ నెల 28న ముగుస్తుందని, ఆ ముగింపు సభలో గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సొంపంగు రాధాకృష్ణ కోరారు. శనివారం చిలుకూరు గ్రామ పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, పర్మినెంట్ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులు..



హుజూర్‌నగర్ : స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సీతారాంనగర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల అవతారమెత్తి తొటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలువురు విద్యార్థులు మంత్రులుగా, వివిధ శాఖల అధికారులుగా విధులు నిర్వర్తించి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థిల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరెడ్డి, నోడల్ ఆఫీసర్ బి.శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం సుహాసిని, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకవీడు ప్రాథమిక పాఠశాలలో..

పాలకవీడు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించారు. కలెక్టర్‌గా ముబీనీ, డీఈఓగా నందిని, హెచ్‌ఎంగా తనూజ విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతరెడ్డి, జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బాలునాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, రేష్మాబేగం, నాగమణి, సరిత, అనిత తదితరులు పాల్గొన్నారు.



పాలకవీడులోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : మండలంలోని రేపాల శివారులో వేంచేసియున్న స్వయంభు శ్రీరాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. శనివారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో రెండవ యాదగిరి దేవాలయంగా పేరుగాంచిన రేపాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్చి రెండవ తేదీ నుంచి పదిరోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొనుగోటి రంగా మాట్లాడుతూ రేపాల బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్తలు, గ్రామ సర్పంచ్ పల్లి రమణ, ఉప సర్పంచ్ గండు జ్యోతి, ఎంపీటీసీ సొంపంగు మోహన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మునగాల : బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం

నడిగూడెం : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం, కరివిరాల, వేణుగోపాలపురం, బృందావనపురం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాల పితామహుడని కొనియాడారు. ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెడ్పీటీసీ బానాల కవిత, తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటనర్సయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌లో తప్పులను సవరించాలి

హుజూర్‌నగర్ : ధరణి పోర్టల్‌లో తప్పులను ప్రభుత్వం వెంటనే సవరించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సుధారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ధరణి, రుణమాఫీ విషయాల్లో రైతుల గోసను పట్టించుకునే నాథుడు లేరా అని ప్రశ్నించారు. ఆయా సమస్యల గురించి తహసీల్దార్‌ని అడిగితే ఆర్డీఓని అడగమని, ఆర్డీఓను అడిగితే కలెక్టర్‌ని అడగమని, కలెక్టర్‌ను అడిగితే ప్రభుత్వ ఆదేశాలు లేవని ఇలా అనేక సాకులు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, రైతు సంఘం నాయకులు బంటు శ్రీనివాస్, గోవర్ధన్, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : డీటీకి వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

ధరణితో రైతులకు తీవ్ర ఇబ్బందులు

చిలుకూరు : ధరణి పోర్టల్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి యాజమాన్య పట్టాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మరోమారు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూమి కలిగిన రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, నాయకులు పిల్లుట్ల కనకయ్య, గంగిరెడ్డి రవీందర్ రెడ్డి, పిల్లుట్ల కనకరావు, కాంపాటి వెంకటేశ్వర్లు, సైదులు, ముత్తారెడ్డి, దశరథ, పిచ్చయ్య, యలగొండ వెంకటేశ్వర్లు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నివారించాలని వినతి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో వీధి కుక్కల బెడద నివారించాలని మున్సిపల్ మేనేజర్ యాకుబ్‌పాషాకు జన చైతన్య ట్రస్ట్ సభ్యులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5వ వార్డులో ఎక్కువగా విద్యా సంస్థలు ఉండడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. ఈ వార్డులో వీధి కుక్కలు సంచరిస్తూ వారిపై ఎగబడుతుండడంతో తీవ్ర భయాందోళన చెందుతున్నారని తెలిపారు. కుక్కల వల్ల ప్రమాదం జరిగిన తర్వాత హడావిడి చేయడం కన్నా ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పి.వంశీ, చైర్మన్ పి.సాయి, ఉపాధ్యక్షుడు పి.శివశంకర్, శ్రీపతి, వెంకి, రమేష్, జయంత్ పాల్గొన్నారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరందించాలి

హుజూర్‌నగర్ రూరల్ : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథకు శ్రీకారం చుట్టారన్నారు. నీటి సరఫరాలో ఆటంకాలను గుర్తించాలని, పైప్‌లైన్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ శాంతకుమారి, సర్పంచ్‌లు అన్నెం శిరీషారెడ్డి, కర్నాటి అంజిరెడ్డి, శాసనాల నాగసైదయ్య, గల్లా సైదులు, ఎంపీఓ మౌలానా, మిషన్ భగీరథ అధికారులు, కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ

హుజూర్‌నగర్ : అవయవదానంతో ఇతరులకు జీవం పోసినట్లు అవుతుందని గాంధీ హాస్పిటల్ వైద్యుడు భానుప్రసాద్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రియదర్శిని కళాశాలలో రతన్ టాటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవ దానంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలు దానం చేయవచ్చని, దీనికి కుటంబసభ్యుల సమ్మతి కావాలని చెప్పారు. దీంతో మరొకరికి పునర్జన్మ ఇచ్చిన వారవుతారని చెప్పారు. కరస్పాండెంట్ పశ్య శ్రీనివాసరెడ్డి, స్వచ్ఛంద సంస్థల సభ్యులు విజయ, లీలావతి, వెంకి, బాబూరావు, నాగరాజు, అధ్యాపకులు ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భానుప్రసాద్

కరపత్రం ఆవిష్కరణ

మోతె : చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఫిబ్రవరి 27న ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మండల మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకుడు గునగంటి నాగరాజు కోరారు. శనివారం మండలంలోని రావిపహాడ్‌లో మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉపేందర్, బయ్య లింగరాజు, పుల్లయ్య, మధు, లింగయ్య, శంకర్ పాల్గొన్నారు.

కుటుంబ విలువలు తెలుసుకోవాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు కుటుంబ విలువలు తెలుసుకోవాలని హెచ్‌ఎం పీవీ రమణరావు అన్నా రు. శనివారం పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో 'కుటుంబ కీర్తి' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులకు పాద పూజ చేసి దీవెనలు తీసుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫ్లెక్సీ చింపిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

చిలుకూరు : చిలుకూరులో బీఎస్పీ ఫ్లెక్సీ చింపిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ కోరారు. శనివారం ఆయన చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై స్థానిక పోలీసులు స్పందించి బీఎస్పీ ఫ్లెక్సీ చింపిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పాలకవీడు : మండలంలోని హన్మయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల బావోజీతండాలో గ్రామస్తుల సహకారంతో చేపట్టిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం ఎంపీపీ భూక్యా గోపాల్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడుఅంజిరెడ్డి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సరిత ఇంద్రారెడ్డి, మోతీలాల్, మోష్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తులపై కేసు

హుజూర్‌నగర్: తప్పుడు పత్రాలు సష్టించి మున్సిపాలిటీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన పి వెంకన్న మిర్యాలగూడ రోడ్డులోని 700 గజాల స్థలంకు తప్పుడు పత్రాలు సష్టించాడు. ఆపత్రాలు నిజమైనవిగా మున్సిపాలిటీ వారిని నమ్మించి అసెస్మెంట్ , ఇంటి నంబర్ పొందారు. సదరు స్థలాన్ని తప్పుడు మార్గంలో సైదులు నాయక్, పి నాగబాబలను సాక్షులుగా చూపించి శీతల మని భర్త రోశపతికి రిజిస్ట్రేషన్ చేశారని మున్సిపల్ కమిషనర్ కె శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.